పార్కు అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేయాలి



పార్కులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ ఎంసీహెచ్ క్వార్టర్స్ ఈ–సేవా కేంద్రం వద్ద ఉన్న పార్కు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ జి.రచనశ్రీ జీహెచ్ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. పార్కులో ఓపెన్ జిమ్, వాకింగ్ పాత్‌వే, ప్రహరీ నిర్మాణ పనులు పూర్తయ్యాయని ఆమె తెలిపారు. పెండింగ్‌లో ఉన్న గ్రీవరీని కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, రంగరాజ్‌గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.ప్రభాకర్ గంగపుత్ర, యువమోర్చా అధ్యక్షుడు సలంద్రి దిలీప్ యాదవ్, నేతలు బొల్ల శ్రీనివాస్, శివరాజ్, గద్దె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆశయాలు పంచుకొనే వారసులు అరుదు



పద్మినికి ఆత్మీయ సత్కారం చేస్తున్న దృశ్యం

విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి

చిక్కడపల్లి: అస్తి పంచుకొనే వారసులు ఉంటారని కానీ కన్నవారి ఆశయాలు పంచుకొనే వారు అరుదు అని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణ అన్నారు. అన్నమాచార్య సంకీర్తనకు తనదైన వ్యాఖ్యానంతో కీర్తిగండించిన కామిశెట్టి శ్రీనివాసులు వారసురాలుగా గోదా లక్ష్మి సాంస్కృతిక బంధువు వేమరాజు నరసింహారావు వారసునిగా విజయకుమార్‌లు వారి ఆశయాలను కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. శ్రీత్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై నవ్యనాటక సమితి అన్నమాచార్య మిషన్ నిర్వహణలో తాళ్లపాక అన్నమయ్య 616 జయంతిని శ్రీపదార్చన పేరిట 50 మంది యువ కళాకారులు అన్నమయ్య కీర్తనలను నృత్య రూపంలో శుక్రవారం రాత్రి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రముఖ నృత్య కళాకారిణి పద్మిని మాచానికి ఆత్మీయ సత్కారం చేశారు. రాష్ట్ర ఖజన లెక్కల శాఖ ఉప సంచలకులు వసుంధర, పోలీస్ ఉన్నతాధికారి విజయకుమార్, ఆచార్య ఫణీంద్ర, రజిత ఆకుల, కామిశెట్టి గోదాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలి



మాట్లాడుతున్న నారాయణరావు

పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మోగిలి వెంకట్‌రెడ్డి, వరంగల్ జిల్లా నాయకులు శివ తదితర విద్యార్థి నాయకులపై తెలంగాణ ప్రభుత్వం పెట్టిన పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ... ఫిబ్రవరిలో ప్రజాసంఘాల నాయకులపై బనాయించిన అక్రమ కేసులో ఈ నెల 18వ తేదీన విద్యార్థి నాయకుల పేర్లను పూసపల్లి కుట్ర కేసులో అక్రమంగా చేర్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని కూలదోయాలనే కుట్ర చేస్తున్నట్లు అభియోగాలు మోపడం దురదృష్టకరమన్నారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కివేయాలనే ఉద్దేశంతోనే కుట్ర కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, వివిధ సంఘాల నాయకులు రహమాన్, రజనీకుమార్, తిరుపతి, మమత, అరుణ్‌కుమార్, ఎం.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



ఫేర్‌వెల్ పార్టీలో పాల్గొన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకొని విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని అంబేడ్కర్ కళాశాల ప్రిన్సిపాల్ మట్టా శేఖర్ అన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో బీఏ, బీకామ్ ఫైనల్ ఇయర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మట్టా శేఖర్ మాట్లాడుతూ... ప్రణాళికాబద్ధంగా విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆభిలషించారు. కామర్స్ విద్యార్థులకు దేశవిదేశాల్లో కూడా మంచి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బండ్ల శ్రీధర్, కుమారస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

ఓబీసీ ఎంపీలను ఏకం చేద్దాం: ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: దేశంలో ఓబీసీ ఎంపీలు అందరినీ ఏకం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కోర్ కమిటీ సమావేశంలో తీర్మానించారు. శుక్రవారం విద్యానగర్ బీసీ భవన్‌లో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. జూన్ 4న దేశంలో వివిధ రాజకీయ పార్టీల నుంచి గెలిచిన ఓబీసీ ఎంపీలను ఏకం చేసి బీసీ బిల్లు కోసం పోరాటం చేసేలా ప్రోత్సహించాలన్నారు. చట్ట సభలలో బీసీలకు రిజర్వేషన్లు, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. జనగణనలో కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి వేణు మాధవ్ అధ్యక్షత జరిగిన సమావేశంలో గుజ్జ కృష్ణ, లాల్‌కృష్ణ, గోరేగే మల్లేష్ యాదవ్, రాజేందర్, నీల వెంకటేష్, అనంతయ్య, నందగోపాల్, రామలింగం, పృథ్వీగౌడ్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభను చాటుతూ ఫ్లెక్సీలు



బంజారాహిల్స్: పదో తరగతి 2024 ఫలితాల్లో సోమాజిగూడ రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖైరతాబాద్ మండల పరిధిలోనే మొదటి స్థానంలో నిలిచారని 21 మంది విద్యార్థులు వేర్వేరు సబ్జెక్టుల్లో 10 జీపీఏ సాధించారంటూ పాఠశాల ఉపాధ్యాయులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ తల్లిదండ్రులను పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్నది. ఇక్కడ 126 మంది విద్యార్థులు పది పరీక్ష రాయగా ఇందులో 123 మంది విద్యార్థులు పాసై 95 శాతం ఫలితాలతో పాఠశాల పేరును నగరవ్యాప్తంగా చాటిచెప్పారు. గత ఏడాది కూడా ఈ పాఠశాల విద్యార్థులు ఖైరతాబాద్ మండల పరిధిలో పది ఫలితాల్లో మొదటిస్థానంలో నిలిచారు. అంతేకాకుండా 11 మంది విద్యార్థులు 9కి పైగా జీపీఏ సాధించి రికార్డు సృష్టించారు. విద్యార్థుల ప్రతిభను, ఘనతను చాటిచెబుతూ ఉపాధ్యాయులు పాఠశాల బయట ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ విశేషంగా ఆకట్టుకుంటుంది. తమ విద్యార్థులు పది ఫలితాల్లో సాధించిన విజయాలను చాటిచెబుతూ దీనిని ఏర్పాటుచేశారు. 95 శాతం ఫలితాలు రావడం పట్ల ఇక్కడ ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తంచేయడమే కాకుండా హైదరాబాద్ జిల్లా పరిధిలోనే మిగతా పాఠశాలలతో పోలిస్తే అత్యుత్తమ ఫలితాలతో రికార్డు సృష్టించిన విషయాన్ని తెలియజేస్తున్నారు.

కాల్వల్లో వ్యర్థాలు.. రోడ్లపై వర్షపు నీరు!



తిలక్‌నగర్ పార్కు చుట్టూ రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

- వ్యర్థాల తొలగింపులో రాజ్యమేలుతున్న నిర్లక్ష్యం
- రోడ్డుపైనే నిలిచిపోతున్న వర్షపు నీరు
- పట్టించుకోని అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం

నల్లకుంట: వర్షా కాలం ముంచుకొస్తోంది. వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు వీలుగా నిర్మించిన నీటి కాల్వలు వ్యర్థాలతో నిండిపోయాయి. దీంతో వర్షాలు ప్రారంభమైతే ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందోననే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారల నిర్లక్ష్యం కారణంగా వర్షపు నీటి కాల్వల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. అవికాస్తా వ్యర్థాలతో నిండిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపు నీరు సజావుగా వెళ్లలేక రోడ్లపైనే నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, పాదచారులు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికితోడు అపరిశుభ్ర వాతావరణం కారణంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులను వ్యాపింపచేస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- నల్లకుంట డివిజన్ పరిధిలోని తిలక్‌నగర్‌లో ఉన్న వార్డు కార్యాలయం ఉన్న పార్కు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. పార్కు పక్క రోడ్డులో నిర్మించిన వర్షపు నీటి కాలువ పూర్తిగా చెత్తాచెదారంతో పూడిపోయింది. దీంతో ఇటీవలి వర్షాలకు ఆ వీధిలో వర్షపు నీరు నిలిచిపోయింది.
- పార్కులో ఉన్న భారీ పూల చెట్టు కొమ్మలు పూర్తిగా రోడ్డుపైకి వాలిపోవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. ఓ వైపు రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు, మరో వైపు చెట్టు కొమ్మల ఆకులు, పూలు వీధిలో రాలిపడుతుండటంతో అక్కడ అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఇకనైనా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి రోడ్డుపైకి వాలిన చెట్టు కొమ్మలను తొలగించి, వర్షపు నీటి కాల్వను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



వీధుల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొన్నా జీహెచ్ఎంసీలోని పారిశుద్ధ్య విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు. ఏపుగా పెరిగిన ఎట్టు కొమ్మలు రోడ్డుపై వాలినా, వర్షపు నీటి కాల్వలు వ్యర్థాలతో నిండిపోయినా స్పందించరు. తిలక్‌నగర్ పార్కును ఆనుకుని ఉన్న వర్షపు నీటి కాల్వ చెత్తాచెదారం నిండుకుపోయింది. ఈ కారణంగా వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోయి ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. వర్షపు నీటి కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలను శుభ్రం చేయాలని పలు మార్లు అధికారులతో మొరపెట్టుకున్నా పెడచెవిన పెడుతున్నారు. వర్షాలు ప్రారంభం కాకముందే అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన వర్షపు నీటి నాలాలను శుభ్రం చేయించాలి.

– బత్తుల రవి, తిలక్‌నగర్‌బస్తీ



తిలక్‌నగర్ పార్కులో కొమ్మలు ఎండి రోడ్డుపైకి వాలిన చెట్టు



తిలక్‌నగర్ పార్కును ఆనుకుని రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

నర్సరీ నుంచే పర్యావరణంపై పాఠాలు బోధించాలి

కాచిగూడ: వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచి విద్యార్థులకు ‘పర్యావరణ పాఠాలకు’ శ్రీకారం చుట్టాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్.సి.హెచ్.రంగయ్య, జాతీయ సలహాదారుడు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సామాజిక బాధ్యతలను విస్మరించి వ్యాపార కేంద్రంగా నేటి విద్యా వ్యవస్థ మారిపోయిందన్నారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ అటకెక్కిందని, దీంతో వాతావరణ సమస్యలు పెరిగిపోతూ మానవ మనుగడకే ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

హంస వాహన సేవలో శ్రీవారు



పూజలు నిర్వహిస్తున్న పండితులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు హంస వాహన సేవలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, కార్యనిర్వాహణ అధికారి కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై స్వామి వారిని వేంచేపు చేసి హంస వాహన సేవలో ఊరేగించారు.

దాచుకున్న డబ్బు ఇస్తే.. బిచాణా ఎత్తివేశాడంటూ ఫిర్యాదు

బంజారాహిల్స్: అవసరాల కోసం వాడుకోవడానికి డబ్బులు దాచుకుంటుండగా సదరు సంస్థ ప్రజలను మోసం చేయడమే కాకుండా బిచాణా ఎత్తేసిందని, వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలివీ... యూసుఫ్‌గూడ సమీపంలోని వెంకటగిరిలో నివసించే బంగీ రవికుమార్ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ తనకు వచ్చే డబ్బులను భద్రపరచుకుందామని ఇందిరానగర్ సెయింట్ మేరీ స్కూల్ సమీపంలో ఉన్న కనకలక్ష్మీ సేవింగ్స్‌లో జమ చేస్తూ వచ్చాడు. ప్రతినెలా జీ పే ద్వారా డబ్బు పంపించేవాడు. అయితే గత జనవరిలో కనకలక్ష్మీ సేవింగ్స్ ఆఫీసు మూసివేశారని స్నేహితుల ద్వారా తెలిసింది. వాస్తవం తెలుసుకునేందుకు రవికుమార్ సదరు కార్యాలయానికి వెళ్లి చూడగా అక్కడి నుంచి బిచాణా ఎత్తేసినట్లు తేలింది. దీంతో కనకలక్ష్మీ సేవింగ్స్ ఎండీ కొండా రవికి ఫోన్ చేయగా డబ్బులు ఇచ్చేది లేదు..ఏమి చేసుకుంటావో చేసుకో అంటూ బెదిరించాడు. తనతో పాటు ప్రజలను సేవింగ్స్ పేరుతో నిండా ముంచిన కొండా రవిపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చీటింగ్ కేసుతో పాటు మనీసర్క్యులేషన్ స్కీమ్ యాక్ట్, ప్రైజ్ చిట్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సినీసంగీత విభావరి



బొబ్బిలి భాస్కర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

చిక్కడపల్లి: జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభలో బొబ్బిలి భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న ఏకగళ, యుగళ గీతాలను శ్రవణానందంగా అలపించి అలంరించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు బొబ్బిలి భాస్కర్‌రెడ్డి పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వర్‌రావు సంగీత పురస్కారాన్ని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి ప్రదానం చేసి సన్మానించారు. పారిశ్రామికవేత్త చిల్లా రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు లంకా లక్ష్మీనారాయణ, ఎం.ఎల్.కాంతారావు, గుదిబండి వెంకట్‌రెడ్డి, రాఘవరెడ్డి, సి.రమణి, డీఏ మిత్ర, సురేఖామూర్తి, హేమవతి, కె.ఎస్.ఆర్.మూర్తి, ఆర్.శ్రీనివాస్, రావూరిమాధవి, శశికళాస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యా దానంతో ప్రగతి సాధ్యం

హాస్యావధాని శంకరనారాయణ



బెటర్ ట్రాజెక్టరీస్ గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న శంకరనారాయణ తదితరులు

చిక్కడపల్లి: అన్ని దానాలకన్న అన్నదానం మిన్న అంటారని.. కానీ విద్య, కళా దానం జీవితాలనే నిలబెడతాయని ప్రముఖ జర్నలిస్ట్, హాస్యావధాని శంకరనారాయణ అన్నారు. ప్రతి మనిషికి దాన, ధర్మ గుణాలు ఉండాలన్నారు. త్యాగరాయగాన సభలో శుక్రవారం అంజన గోలి రచించిన ‘బెటర్ ట్రాజెక్టరీస్’ ఆంగ్ల వ్యాస సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా హాజరైన శంకరనారాయణ మాట్లాడుతూ... రచయిత్రి అంజన తన పుస్తకంలో నేటి యువతరానికి మార్గ నిర్దేశనం చేసే పలు అంశాలు ప్రస్తావించారని కొనియాడారు. అంతకు ముందు గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై సంపుటిని ఆవిష్కరించారు. ప్రముఖ జర్నలిస్ట్ ఎల్లాప్రగడ మల్లికార్జున రావు, సాహితీవేత్త విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో చిన్నారికి తీవ్ర గాయాలు

- సెలవుల్లో అమ్మమ్మ, తాతయ్య ఇంటికి వచ్చిన చిన్నారి
- మేడమీద ఆడుకుంటూ హైటెన్షన్ వైర్లను తాకిన మిల్కి



గాయపడ్డ మిల్కి

రహమత్‌నగర్: వేసవి సెలవుల్లో సరదాగా గడుపుదామని అమ్మమ్మ, తాతయ్య ఇంటికి వచ్చిన ఓ చిన్నారి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన రహమత్‌నగర్ డివిజన్ ఎస్‌పీఆర్‌హిల్స్‌... ఎస్ఎస్‌బీనగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలివీ... ఎస్ఎస్‌బీనగర్ ప్రధాన రహదారి పక్కన హైటెన్షన్ తీగల కింద రమేష్ అనే వ్యక్తి కుటుంబం నివాసం ఉంటుంది. మేడపై ఉన్న విద్యుత్ హైటెన్షన్ తీగల కింద ఓ గదిలో జీహెచ్ఎంసీ పనిచేసే యాకయ్య దంపతులు కిరాయికి ఉంటారు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో నివాసముండే శ్రీనివాస్ అనితల కుమార్తె లక్కీ వేసవి సెలవులకని ఇటీవల ఎస్ఎస్‌బీనగర్‌లోని తాతయ్య యాకయ్య ఇంటికి వచ్చారు. శుక్రవారం సాయంత్రం మేడ ఉన్న గది ముందు యాకయ్య టేప్‌తో మనవరాలు మిల్కి(8) ఆడుకుంటుండగా పైన తక్కువ ఎత్తులో ఉన్న హైటెన్షన్ తీగలు తగిలాయి. దీంతో మిల్కి విద్యుదాఘాతానికి గురైంది. ఈ ప్రమాదంలో మిల్కి తీవ్రంగా గాయపడింది. స్థానికులు గాయపడ్డ చిన్నారిని హుటాహుటిన స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు. మిల్కి ప్రస్తుతం మూడో తరగతి చదువుతోంది. మిల్కి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

జూన్ 10 నుంచి ఆమరణ దీక్ష

పంజగుట్ట: విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జూన్ 10వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేయనున్నట్లు వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎన్నికల ఇండిపెండెంట్ అభ్యర్థి పాలకూరి అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉస్మానియా యూనివర్సిటీ నిరుద్యోగ జేఏసీ, వివిధ విద్యార్థి, నిరుద్యోగ సంఘాలు ఆయనకు మద్దతుగా నిలిచాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు, నిరుద్యోగులకు వ్యతిరేకంగా ఉన్న గత ప్రభుత్వాన్ని దించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చినా ఒరగబెట్టింది ఏమీలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. ఆజామ్‌బాద్ ఫీడర్ పరిధిలో అచ్చుత్‌రెడ్డి మార్గ్, సీపీఎం ఆఫీస్, రాంనగర్ గూండు, విద్యానగర్ పోస్టు ఆఫీస్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ ఉండదన్నారు. మదర్ డైరీ ఫీడర్ పరిధిలో రాంనగర్ ఎక్స్‌రోడ్డు, జయరాంరెడ్డి, మదర్స్ హై స్కూల్, లక్ష్మమ్మ పార్కు తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్ ఫీడర్ పరిధిలో రిసాల, అంబేడ్కర్‌నగర్, హరినగర్, అచ్చయ్యనగర్, అల్లాడి రాజ్‌కుమార్‌నగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు. దయారా మార్కెట్ ఫీడర్ పరిధిలో జమిస్తాన్‌పూర్, హరినగర్, సాగర్‌లాల్ ఆసుపత్రి, తాడి కంపౌండ్ తదితర ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏడీఈ వివరించారు.

31న మెగా జాబ్ మేళా

అంబర్‌పేట: నిరుద్యోగ యువతీయువకుల కోసం ఈ నెల 31న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లాయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (గ్రీన్ ల్యాండ్స్) సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా చేపట్టనున్నట్లు సంస్థ ప్రతినిధులు హరిసందీప్, ముప్వ రాంరెడ్డి, లక్ష్మీకుమారి తెలిపారు. జాబ్ మేళాలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలతో పాటు ఇతర పేరొందిన సంస్థలు పాల్గొని వివిధ రకాల ఉద్యోగులను నియమించుకొనున్నట్లు వారు వెల్లడించారు. 10వ తరగతి నుంచి బీటెక్, ఎంబీఏ అర్హత కల నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18–30 సంవత్సరాల వయసు వారు అర్హులన్నారు. జాబ్ మేళాలో 25 సంస్థలు పాల్గొని 5 వేల ఉద్యోగాలను భర్తీ చేసుకుంటాయని వారు తెలిపారు. ఈ జాబ్ మేళా రాణిగంజ్ గుజరాతి హైస్కూల్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. వివరాలకు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వెబ్‌సైట్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో సంప్రదించాలన్నారు. ఫోన్: 95424 33427లో వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నకు మద్దతు

మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

కాచిగూడ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మున్నూరుకాపు ముద్దుబిడ్డ, సీనియర్ జర్నలిస్టు చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు ప్రకటించారు. శుక్రవారం కాచిగూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తీన్మార్ మల్లన్నకు ఆయా జిల్లాలకు చెందిన మున్నూరుకాపు పట్టభద్రులందరూ ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. నేతలు కొండూరు వినోద్ కుమార్, కట్టెల సుభాష్ పటేల్, కొంతం సురేష్ బాబు, మణికొండ రమేష్ కుమార్, మించు ఆనంద్, ప్యాట రవీందర్, అయిలీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోపన్‌పల్లిలో ఇళ్ల స్థలాల పంపిణీలో న్యాయం చేయండి

తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం విజ్ఞప్తి

హిమాయత్‌నగర్: శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలో ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాల పంపిణీ విషయంలో న్యాయం చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమరెల్లి, కార్యనిర్వాహక కార్యదర్శి జి.సూర్యకళ తదితరుల నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి ఇళ్ల స్థలాల కేటాయింపు విషయమై విన్నవించగా సమగ్ర వివరాల కోసం రంగారెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారని గుర్తు చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వగా, ఇళ్లను నిర్మించుకోలేదనే నెపంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు లాక్కుని తీవ్ర ద్రోహానికి పాల్పడిందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి న్యాయం చేయాలని కోరతామని వారు తెలిపారు. సంఘం ప్రతినిధులు రామనాథం చెట్టి, అబ్దుల్ సాదిక్, కమలాకర్ రావు, ఎం.స్వర్ణకుమారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన ‘కార్పొరేట్’



పంజగుట్ట: జ్యువెలరీ రంగంలోకి కార్పొరేట్ శక్తులు ప్రవేశించిన విశ్వకర్మల ఆత్మగౌరవం దెబ్బతీశాయని బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిజాం, కాకతీయ, రాచకొండ మూడు మన ప్రాంత సాంస్కృతిక చరిత్రను ప్రతిభింభించేలా నికారా అనే పేరుతో డైమండ్ జ్యువెలరీ షోరూం ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. శుక్రవారం పంజగుట్ట గలేరియా మాల్‌లో షోరూంను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... డైమండ్ జ్యువెలరీ అంటే కేవలం డబ్బున్నవారికే పరిమితమన్న అపోహను నికారా జ్యువెలరీ నిర్వాహకుడు శ్రీనివాసాచారి తొలగించారన్నారు.

భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు

వెంగళరావునగర్: తన భార్య కనిపించడం లేదంటూ ఒక వ్యక్తి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలివీ... జవహర్‌నగర్‌లో నివసించే వెంకటేష్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 19న తాను బయటకు వెళ్లగానే నల్లచెరువు ప్రాంతానికి చెందిన అంజి అనే యువకుడు జవహర్‌నగర్ వచ్చి తన భార్యను వెంట తీసుకెళ్లాడు. యాస్మిన్ వెళుతూ ఫోన్, ట్యాబ్, రూ. 25 వేలు తీసుకెళ్లింది. దాంతో తన ఐదేళ్ల కుమార్తె తల్లికోసం విలపిస్తుంది. వారు మోహిదీపట్నంలో ఉన్నట్టుగా మరదలు తెలియజేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

భర్త కనిపించడం లేదంటూ భార్య ఫిర్యాదు...

డ్యూటీకి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన భర్త తిరిగి ఇంటికి రాలేదని మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలివీ... విజయనగరం ప్రాంతానికి చెందిన మామిడిలక్ష్మి, శంకర్ దంపతులు. రెండేళ్లుగా రహమత్‌నగర్‌లో ఉంటున్నారు. శంకర్ శ్రీనగర్‌కాలనీలోని క్రీ పాయింట్‌లో కుక్‌గా పనిచేస్తాడు. ఈ నెల 23న శంకర్ పనికి వెళ్లాడు. కొంత సేపటికి శంకర్‌తో పాటు విధులు నిర్వహించే మనోజ్ ఇంటికి వచ్చి తన భర్త విధులకు రాలేదని చెప్పాడు. సాయంత్రం శంకర్‌కు వరుసకు సోదరుడైన సత్యనారాయణకు తన భర్త ఫోన్ నుంచి రూ. 10 వేలు ఫోన్‌పే ద్వారా వచ్చాయి. అతని ఫోన్ స్విచాఫ్ చేసి ఉంది. దాంతో తన భర్త ఆచూకీ తెలియజేయాలంటూ లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.